
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

ఖమ్మం 3
ఉష్ణోగ్రత ఖమ్మం : గరిష్ఠం 33 । కనిష్ఠం 21 భద్రాద్రి కొత్తగూడెం : గరిష్ఠం 35 । కనిష్ఠం 25 బుధవారం, 14 ఫిబ్రవరి 2024


కీర్తనలు ఆలపిస్తున్న మల్లాది సూరిబాబు, రవికుమార్



హాట్‌సీట్ దక్కేదెవరికి?

- ఖమ్మం లోక్‌సభ సీటుకు కాంగ్రెస్‌లో తీవ్ర పోటీ
- ఇక్కడినుంచి సోనియా, ప్రియాంక పోటీ లేనట్లే
- ప్రయత్నాలను ముమ్మరం చేసిన ఆశావహులు

ఖమ్మం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి ఏఐసీసీ అధినేత సోనియాగాంధీ, ప్రియాంకగాంధీలు పోటీచేసే అవకాశం లేకపోవడంతో ఈ టికెట్ కోసం పోటీ తీవ్రతరం కాబోతోంది. ఇప్పటివరకు ఖమ్మం స్థానం నుంచి సోనియా లేదా ప్రియాంకల్లో ఎవరో ఒకరు పోటీ చేస్తారని కాంగ్రెస్ పార్టీ నాయకత్వం భావించగా ఈ పరిస్థితి కనిపించడం లేదు. సోనియాగాంధీ రాజస్థాన్ నుంచి రాజ్యసభకు వెళ్లేందుకు నిర్ణయించుకోగా ప్రస్తుతం ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న రాయబరేలి స్థానం నుంచి ప్రియాంకగాంధీ పోటీ చేయనున్నారు. దాంతో ఖమ్మం లోక్‌సభ స్థానానికి తీవ్ర పోటీ నెలకొంది. ఖమ్మం నుంచి ఆశావహులు అధికంగా ఉండడం, వారంతా పార్టీలో ముఖ్యులు కావడంతో అభ్యర్థి ఎంపిక కాంగ్రెస్ అధిష్ఠానానికి పెద్ద సమస్యగా మారింది. స్ర్కీనింగ్ కమిటీ సమావేశంలో ఢిల్లీకి ఎవరి పేర్లు వెళ్లాయో కూడా గోప్యంగా ఉంచారు. ఖమ్మం ఎంపీ టికెట్ కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి కూడా ఆశిస్తున్నారు. గత ఎన్నికల్లో ఆమె పోటీచేసి ఓటమి చెందినా 1999, 2004లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం ఎంపీగా విజయం సాధించారు. కేంద్రమంత్రి అయ్యారు. ఆ తర్వాత రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఈసారి లోక్‌సభకు పోటీచేసి విజయం సాధించాలన్న లక్ష్యంతో ఉన్నారు. అయితే ఆమె పేరు రాజ్యసభకు సైతం ప్రచారంలో ఉంది. కాగా ఖమ్మం టికెట్‌కు మాజీ ఎంపీ వి.హనుమంతరావు దరఖాస్తు చేసి ప్రయత్నాల్లో ఉన్నారు. మరోవైపు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క సతీమణి మల్లు నందిని, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు ప్రసాదరెడ్డి కూడా ఖమ్మం టికెట్ కోసం దరఖాస్తు చేశారు. వీరంతా టికెట్ కోసం గట్టి ప్రయత్నాలు సాగిస్తున్నారు. మరోవైపు పీసీసీ నాయకుడు జెట్టి కుసుమకుమార్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు రాయల నాగేశ్వరరావు, వీవీసీ అధినేత వంకాయలపాటి రాజేంద్రప్రసాద్‌తో పాటు మరికొందరు ఖమ్మం టికెట్‌కోసం దరఖాస్తు చేశారు. అయితే వీరందరుకూడా ఖమ్మంలో సోనియాగాంధీ పోటీ చేస్తే ఆమెకే మద్దతు పలికి గెలిపించుకుంటామని ప్రకటించారు. కానీ తాజాగా సోనియా, ప్రియాంక ఇద్దరూ ఖమ్మం నుంచి పోటీ చేసే అవకాశం లేకపోవడంతో ఈ స్థానంలో అభ్యర్థి ఎంపిక చివరి వరకు ఉత్కంఠంగా ఉండే అవకాశం ఉంది.


నేలకొండపల్లిలో బాలిక నృత్య ప్రదర్శన

ఝుమ్మంది నాదం

- అలరించిన మల్లాది సంగీత కచేరీ
- భద్రాద్రిలో రెండోరోజు ఘనంగా వాగ్గేయకారోత్సవాలు
- నేలకొండపల్లిలోనూ కొనసాగిన ఉత్సవాలు

భద్రాచలం/నేలకొండపల్లి, ఫిబ్రవరి 13: ప్రముఖ సంగీత విద్వాంసులు మల్లాది సూరిబాబు, వారి కుమారుడు రవికుమార్ ఆలపించిన భక్తరామదాసు, తూము నరసింహదాసు కీర్తనలు భక్తులను భక్తిసారరంలో ముంచెత్తాయి. భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భక్తరామదాసు 391వ జయంతి ప్రయుక్త వాగ్గేయకార ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రెండోరోజు సంగీత కార్యక్రమాలు అలరించాయి. మల్లాది ద్వయం, నాధస్వర బృందం భక్తరామదాసు కీర్తనలు ఆలపించారు. హైదరాబాద్‌కు చెందిన సుందరి జానకిరాం బృందం, శేషం రమణ, డాక్టర్ కె. శేషులత, ప్రణతి యశశ్వి, గణపతి సచ్చిదానంద స్వామి భక్త బృందం, చెన్నైకు చెందిన అర్చన, సామ్నవి ఆలపించిన కీర్తనలు ఆకట్టుకున్నాయి. భక్తరామదాసు జన్మస్థలం నేలకొండపల్లిలోని ధ్యానమందిరంలోనూ వాగ్గేయకారోత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం ఖమ్మం సప్తస్వర సంగీత కళానిలయం వారిచే రామదాసు కీర్తనల కచేరీ నిర్వహించారు. డాక్టర్. ఎంవీ శ్రీనివాసమూర్తి(బెంగళూరు), డాక్టర్‌పి కోదండరామయ్య(విజయవాడ) నిర్వహించిన కార్యక్రమం ఆకట్టుకుంది. కురిచేటి రజని(భద్రాచలం) నిర్వహణలో భద్రాచలం నుంచి వచ్చిన భక్తుల సుందరాకాండ పారాయణం ఆహూతులను ఆకట్టుకుంది. సాయంత్రం నాదెండ్ల సీతారత్నం సమర్పణలో హైదరాబాద్ వాగ్దేవి మ్యూజిక్ అకాడమీ నిర్వహించిన సంగీత కచేరీ ఆకట్టుకుంది.

కూరాకుల పిటిషన్ డిస్మిస్

- వీవీ పాలెం సొసైటీతో పాటు డీసీసీబీ చైర్మన్ పదవి కోల్పోయే అవకాశం
- డీసీసీబీ వైస్‌చైర్మన్ దొండపాటికి త్వరలో చైర్మన్ పగ్గాలు



ఖమ్మం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ కూరాకుల నాగభూషయ్య ఖమ్మం డీసీసీబీ చైర్మన్ పదవితో పాటు ఆయన డైరెక్టర్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న వి వెంకటాయ పాలెం సొసైటీ అధ్యక్ష పదవిని కోల్పోబోతున్నారు. వీవీపాలెం సొసైటీలో ఆనపై పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ కూరాకుల హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా ఆ పిటిషన్‌ను మంగళవారం కోర్టు డిస్మిస్ చేసింది. ఖమ్మం డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్య ఎన్నికైన వీవీపాలెం సొసైటీ అధ్యక్ష పదవిపై ఆ సంఘంలోని డైరెక్టర్లు అవిశ్వాసం వ్యక్తం చేస్తూ జిల్లా సహకారశాఖ అధికారికి ఫిర్యాదు చేయడంతో గతనెల 27న అవిశ్వాస ఓటింగ్ నిర్వహించారు. 13మంది డైరెక్టర్లకుగాను 11మంది హాజరై సొసైటీ చైర్మన్‌కు వ్యతిరేకంగా ఓటువేశారు. అయితే అవిశ్వాస నోటీసును వ్యతిరేకిస్తూ డీసీసీబీ చైర్మన్ హైకోర్టుకు వెళ్లడంతో ఓటింగ్ ఫలితాలపై స్టే విధించి, ఓటింగ్ వివరాలను సీల్డ్ కవర్‌లో పంపించాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది.

కేసు విచారించిన హైకోర్టు కూరాకుల పిటీషన్‌ను డిస్మిస్ చేసింది. దీంతో ఆయనపై పెట్టిన అవిశ్వాసం ఓటింగ్ ఫలితాలను జిల్లా సహకార అధికారి ప్రకటించనున్నారు. దీంతో కూరాకుల తన సొసైటీ అధ్యక్ష పదవితో పాటు డీసీసీబీ చైర్మన్ పదవి కోల్పోనున్నారు. తరువాత తాత్కాలికంగా డీసీసీబీ చైర్మన్ బాధ్యతలను వైస్‌చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావుకు, వీ.వెంకటాయపాలెం సొసైటీ చైర్మన్ బాధ్యతలను వైస్ చైర్మన్ రావెళ్ల శ్రీనివాసరావుకు అప్పగించనున్నారు. ఇదిలా ఉండగా హైకోర్టులో తాను వేసిన పిటిషన్ డిస్మిస్ కావటంతో తాను పదవులు కోల్పోవడం ఖాయమని తెలిపోవటంతో మంగళవారం కూరాకుల డీసీసీబీకి చెందిన కారును, డ్రైవర్‌ను, తన ఇంటి వద్ద ఉండే నలుగురు సహాయకులను వెనక్కు పంపించారు.

మల్లు ఇంట విషాదం

- డిప్యూటీ సీఎం భట్టికి సోదర వియోగం
- ఫ్రొఫెసర్ డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు కన్నుమూత
- నేడు స్నానాల లక్ష్మీపురంలో అంత్యక్రియలు

వైరా, ఫిబ్రవరి 13: డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సోదరుడు, విశ్రాంత ఆయూష్ అదనపు డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు(72) అనారోగ్యంతో మంగళవారం హైదరాబాద్‌లో మృతిచెందారు. డాక్టర్ వెంకటేశ్వర్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు అన్నయ్య కాగా, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మల్లు రవికి తమ్ముడు. ఖమ్మం జిల్లా వైరా మండలంలోని స్నానాల లక్ష్మీపురం గ్రామానికి చెందిన మల్లు అఖిలాండం, మాణ్యిక్యమ్మ దంపతులకు తొమ్మిదిమంది సంతానం ఉన్నారు. వీరిలో ఇప్పటికే భట్టి విక్రమార్క పెద్ద సోదరుడు మల్లు అనంతరాములు, అక్కచెల్లెళ్ల శ్రీరామరత్తమ్మ, రాధమ్మ మృతిచెందారు. డాక్టర్ వెంకటేశ్వర్లు గత కొంతకాలంగా అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. డాక్టర్ వెంకటేశ్వర్లు ఉమ్మడి ఏపీలో హోమియోపతి డాక్టర్‌గా పనిచేశారు. ఉద్యోగ విరమణ తర్వాత కూడా ఖమ్మం, వైరాల్లో హోమియో మందులు పంపిణీ చేస్తూ వందలాదిమంది రోగులకు సేవలందించారు. వైరాలో ఉంటూ స్నానాలలక్ష్మీపురంలోని తన వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయం చేసేవారు.


అంత్యక్రియల ఏర్పాట్లపై చర్చిస్తున్న కుటుంబ సభ్యులు



స్నానాల లక్ష్మీపురంలో అంత్యక్రియలు

వైరా మండలం స్నానాలలక్ష్మీపురంలోని తమ వ్యవసాయ క్షేత్రంలో బుధవారం డాక్టర్ వెంకటేశ్వర్లు భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఈ మేరకు కుటుంబసభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు మల్లు కుటుంబ సభ్యులకు సహకారం అందిస్తున్నారు. డాక్టర్ వెంకటేశ్వర్లు అంత్యక్రియలు నిర్వహించనున్న వ్యవసాయ క్షేత్రాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మంగళవారం పరిశీలించారు. అలాగే డాక్టర్ మల్లు రవి కూడా అంత్యక్రియల ఏర్పాట్లను పరిశీలించారు. హైదరాబాద్ నుంచి డాక్టర్ వెంకటేశ్వర్లు భౌతికకాయాన్ని మంగళవారం సాయంత్రం వైరాకు తీసుకువచ్చి ఆయన ఇంటి వద్ద స్థానికుల సందర్శనార్థం ఉంచారు. బుధవారం స్నానాల లక్ష్మీపురానికి భౌతికకాయాన్ని తరలించి ప్రజలు సందర్శించిన తర్వాత అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో పోలీసులు వైరా, స్నానాలలక్ష్మీపురంలలో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

జేఈఈ తొలివిడత ఫలితాలలో న్యూ విజన్ విజయ కేతనం

ఖమ్మం ఖానాపురంహవేలి ఫిబ్రవరి 13: మంగళవారం విడుదల అయిన జేఈఈ మెయిన్ తొలి విడత పరీక్షా 2024 ఫలితాల్లో ఖమ్మం నగరంలోని న్యూ విజన్ జూనియర్ కళాశాల విద్యార్థి కొప్పుల వర్షిత్ 99.9833 పర్సంటైల్‌తో మరోసారి జయకేతనం ఎగురవేసిందని న్యూ విజన్ విద్యాసంస్థల చైర్మన్ సి.హెచ్. జీకే ప్రసాద్ తెలిపారు. రాష్ట్రంలో హైదరాబాదు మినహా ఏ. ఇతర జిల్లాల విద్యార్థులు సాధించని ఘన విజయం ఖమ్మం జిల్లా నుంచి 99 పర్సంటైల్ 20 మంది విద్యార్థులు, మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులలో 100/100 పర్సంటైల్ న్యూ విజన్ జూనియర్ కళాశాల సాధించిందని తెలిపారు. జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన జేఈఈ ప్రధాన పరీక్ష ఫలితాలలో మహస్వీ 99.9619867, ప్రభంజన్ జాదవ్ 99.8711257, రుషిధర్‌రెడ్డి 99.8182525, మురళీకృష్ణ 99.8081085, శ్రీరామ్ గాదే 99.8081085, నితీష్‌కుమార్ 99.7454141, రేవంత్ పిల్లలమర్రి 99.628897, సుమంత్ యడవల్లి 99.6254162, ఎండి సమ్రీన్ 99.6050326, ప్రసూన తెల్లకుల 99.4327788, లక్ష్మీ ప్రణతి కలకోట 99.414274, సుస్మిత పొన్నం 99.2687834, గోవర్దన్ సాయి పసుమరి 99.2326407, సాత్విక్ చనగారప -99.2057774,, దివ్యశ్రీ 99.1591203, శ్రీ చరణ్‌రెడ్డి 99.1386744, పవన్‌కుమార్ ముత్యాల 99.114932, కేతన్‌కుమార్ 99.114932, అక్షయ్ కుమార్ 99.0887266, వంటి మరెన్నో ఉత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. రాబోయే ఏప్రిల్, మే నెలల్లో జరగబోయే జేఈఈ మెయిన్, జేఈఈ అడ్వాన్స్‌డ్ , నీట్ పరీక్షల్లో కూడా తమ కళాశాల విద్యార్థులు జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఉత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులను న్యూ విజన్ విద్యాసంస్థల చైర్మన్ సి. హెచ్.జి.కె. ప్రసాద్, అకడమిక్ డైరక్టర్ సి.హెచ్. కార్తీక్, డైరక్టర్ సి.హెచ్. గోపిచంద్, కళాశాల ప్రిన్సిపాల్ బ్రహ్మాచారి, శ్రీనివాసరావు, రమేష్ , అధ్యాపకబృందం పాల్గొని అభినందించారు.


విద్యార్థులతో కళాశాల చైర్మన్ ప్రసాద్


విద్యార్థిని అభినందిస్తున్న ప్రసాద్

జేఈఈ మెయిన్స్ ఫలితాలలో హార్వెస్ట్ విజయభేరి

జేఈఈ మెయిన్స్ మొదటి విడత ఫలితాలలో ఖమ్మం నగరంలోని హార్వెస్ట్ విద్యార్థులు అద్భుతంగా రాణించి, మంచి ఫలితాలను రాబట్టారని హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల యాజమాన్యం మంగళవారం తెలిపింది. 100 మందికి పైగా విద్యార్థులు అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారని, ఇది పరీక్షరాసిన విద్యార్థులలో 50 శాతంగా ఉంది. వీరిలో 8 మంది విద్యార్థులు 99 పర్సంటైల్ పైన సాధించారని కరస్పాండెంట్ పి.రవిమారుత్ , ప్రిన్సిపాల్ ఆర్. పార్వతీరెడ్డి తెలిపారు. వి.జస్వంత్ 99.94, ఎ. జిగ్నేష్ 99.87, జి. రాజ్‌వర్ధన్ 99.83, అవినాష్ 99.78, విశ్వతేజ 99.70, కె ప్రణయ్ 99.39, అభినవ్ 99.25, సాయి సుజయ్ 99.20 పర్సంటైల్ సాధించి అగ్రభాగాన నిలిచారని తెలిపారు. 5గురు 98 పర్సంటైల్ పైగా, 6గురు 97 పర్సంటైల్పైన, 7గురు 96 పర్సంటైల్ పైన సాధించారని, మొత్తం 43 మంది విద్యార్థులు 90 పర్సంటైల్ పైగా సాధించారని తెలిపారు. వేల్పుల జశ్వంత్ ఎల్‌కేజీ నుంచి 12వ తరగతి వరకు హార్వెస్ట్ స్కూల్లోనే చదవి 99.94 పర్సంటైల్ సాధించటం గర్వకారణంగా ఉందని ప్రిన్సిపాల్ ఆర్. పార్వతీరెడ్డి తెలిపారు. ప్రైమరీ స్థాయినుంచి 12వ తరగతి వరకు హార్వెస్ట్‌లో చదివిన విద్యార్థులు 25 మందికి పైగా ఉన్నారని కరస్పాండెంట్ పి. రవిమారుత్ తెలిపారు.. అడుసు మిల్లి జిగ్నేస్ ఎంబైపీసీ లో చదువుతూ జేఈఈలో 99.86 పర్సంటైల్ సాధించటం విశేషమనీ, రాబోయేనీట్ పరీక్షలో ఎయిమ్స్ లో సీటుసాధించగలడని యాజమాన్యం తెలిపింది. విద్యార్థులను అభినందిస్తూ జేఈఈ మెయిన్స్ రెండవ విడతలో కూడా మంచి పర్సంటైల్ సాధించాలని విద్యార్థులకు సూచించారు.


విద్యార్థులతో కళాశాల కరస్పాండెంట్ రవిమారుత్


విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

జేఈఈ ఫలితాల్లో శ్రీచైతన్య ప్రతిభ

జేఈఈ 2024 పరీక్షా ఫలితాల్లో ఖమ్మం నగరంలోని శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు విజయదుందుభి మోగించారని విద్యా సంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. కళాశాలకు చెందిన విద్యార్థులు అభిలాష 99.88, శ్రీరామ్ తేజ 99.78, వర్షిత్ కౌండన్య 99.72, తుషార్ చౌదరి 99.69, నాగశ్రీ 99.67, శ్రీపూజిత 99.56, సాయికుమార్ 99.45, నవదీప్‌కిరణ్ 99.44, సాయి దినేష్‌రెడ్డి 99.43, రఘునాథ్ 99.40, శ్రీ సాత్విక్ 99.29, జెమిని నాయక్ 99.23, ప్రణవ్ జాయి99.15, తోపాటు మరికొంత మంది అత్యుత్తమ పర్సంటైల్ సాధించారు. 99 కుపై గా పర్సంటైల్‌తో 15 మంది విద్యార్థులు, 98 పర్సంటైల్ పైగా 23 మంది విద్యార్థులు, 97 పర్సంటైల్ పైగా 39 మంది విద్యార్థులు, 96 పర్సంటైల్ పైగా 54 మంది విద్యార్థులు, 90 పర్సంటైల్ పైగా 135 మంది విద్యార్థులు స్కోర్లను సాధించారని తెలిపారు. తెలంగాణ శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఉత్తమ అధ్యాపకులతో విద్యాబోధనను అందిస్తున్నామన్నారు. ఎప్పటికప్పుడు సమీక్షించడం ల్లనే తమ విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్ సాధించగలిగారని తెలిపారు. విద్యార్థుల ప్రగతిని నిరంతరం సమీక్షించడం వల్లనే ఈ విజయాలు సాధ్యపడ్డాయని విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. ఈ విజయాన్ని సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్, డైరెక్టస్, అకడమిక్ డైరెక్టస్ బి. సాయిగితిక, తదితరులు అభినందించారు.


విద్యార్థులతో కళశాల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య

కృష్ణవేణి ఐఐటీ, మెడికల్ అకాడమి విజయకేతనం

జేఈఈ మెయిన్స్ మెదటి విడత ఫలితాల్లో ఖమ్మం నగరంలోని కృష్ణవేణి ఐఐటీ, మెడికల్ అకాడమి కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని డైరెక్టర్స్ గొల్లపుడి జగదీష్, మాచవరపు కోటేశ్వరరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. కళాశాలకు చెందిన ఎం ఉజ్వాల మానస 99.01, నవదీప్ 98.29, మెహెక్ తబస్సుమ్ 94.1, నితిన్ 92.97, మోహన్‌రావు 91.74, శ్రీరామ్ 91.67 జనకంట సాయి 91.55, ఉమేష్ చంద్రన్ 90.78, శృతి 90.54, శ్యాంమ్ శ్రీనియె 90.46, సంధ్య 90.27 పర్సంటైల్ సాదించారని తెలిపారు. విద్యార్థులను కళాశాల డైరెక్టర్స్, ప్రిన్సిపాల్ గుర్రం రామచంద్రయ్య తదితరలు అభినందించారు.


విద్యార్థులతో కళాశాల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు

రెజొనెన్స్ విజయభేరి

జేఈఈ 2024 ఫలితాలలో ఖమ్మం నగరంలోని రెజొనెన్స్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించారని డైరెక్టర్స్ ఆర్.వి. నాగేంద్ర కుమార్, కొండా శ్రీధర్‌రావు తెలిపారు. కళాశాలకు బి, కిరణ్‌కుమార్ రెడ్డి 99.190, ఎం. రాకేష్ సుశాంత్ 98.78, ఎం. సాయి శ్రీ హర్ష 97.79, ఎం. వెంకటసాయి చేతన్ 96.92, అంకుష్ వర్మ 95.722, శ్రవిష్ఠ 94.521, రిషిక 93.180, యశ్వంత్ 92.712 వంటి అత్యుత్తమ పర్సంటైల్ లతో పాటు సుమారు 82 శాతం మంది పైగా విద్యార్థులు అర త సాధించారని తెలిపారు. ఘన విజయం సాధించడానికి పటిష్టమైన ప్రణాళిక అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం బోధనానుభవం కలిగిన మెనేజ్ మెంట్ ఈ విజయానికి కారణమని అన్నారు. విద్యార్థులను, అధ్యాపకులను, తల్లిదండ్రులను అభినందించారు.


విద్యార్థులతో కళాశాల డైరెక్టర్లు నాగేంద్రకుమార్, శ్రీధర్‌రావు

మాతృమరణాలను నియంత్రించాలి

- మెడికల్ కళాశాల, అధికారులతో కలెక్టర్ సమీక్ష

ఖమ్మంకలెక్టరేట్, ఫిబ్రవరి 13: జిల్లాలో మాతృ మరణాలను నివారించడంపై ప్రత్యేకదృష్టి సారించాలని కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. మంగళవారం ప్రభుత్వ వైద్యకళాశాల సమావేశమందిరంలో ఆయన మాతృ మరణాలపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ప్రసవ సమయంలో వివిధ కారణాలతో ఇటీవలె గర్భిణులు మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గర్భవతులకు మెరుగైన వైద్యం అందించి సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దేశంలో మాతృ మరణాల రేటు 52 ఉండగా, తెలంగాణలో 42, ఖమ్మం జిల్లాలో 45 ఉందన్నారు. జిల్లాలో ఏప్రిల్, 2023 నుంచి జనవరి, 2024 వరకు 9 మాతృ మరణాలు సంభవించినట్లు, మరణానికి కారణాలు గుర్తించాలన్నారు. ఈలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ వైద్యాధికారులతో సమీక్షించారు. ప్రసవానంతరం బాలింతలను 45 రోజులపాటు పర్యవేక్షించాలని సూచించారు. జిల్లాలో ప్రతి నెలా వంద శాతం గర్భిణుల వివరాలు నమోదు చేయాలన్నారు. గర్భం దాల్చినప్పటి నుండి నిరంతరం పరీక్షలు చేసి రక్తహీనత బారినపడకుండా గర్భిణులను కాపాడాలన్నారు. కుటుంబ నియంత్రణ పై కౌన్సిలింగ్ చేయాలని ఆయన తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గర్భిణుల ఆరోగ్యసంరక్షణ పై అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృత పరచాలన్నారు. వైద్యులు దైవంతో సమానమని, రోగులు పూజిస్తారని, ఆ వృత్తికి వన్నె తెచ్చేలాసేవలు అందించాలని కలెక్టర్ గౌతమ్ ఆకాంక్షించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. రాజేశ్వరరావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ బి. వెంకటేశ్వర్లు, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామునాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సైదులు, మెడికల్ కళాశాల హెచ్‌ఒడి లు, వైద్యాధికారులు, ఆశాలు, మృతుల అటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ గౌతమ్

గంజాయి మత్తులో విద్యార్థులతో యువకుడి ఘర్షణ

● పోలీసులకు అప్పగించిన గ్రామస్థులు

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 13: విద్యార్థులతో ఘర్షణ పడిన యువకుడిని గ్రామస్థులు పోలీసుల కు అప్పగించిన సంఘటన మండల పరిధిలోని కామంచికల్లులో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. ఓ యువకుడు తనతో పాటు మరికొంత మందితో కలిసి కామంచికల్లు ఉన్నత పాఠశాల వద్దకు వచ్చి విద్యార్థులతో ఘర్షణపడ్డారు. విద్యార్థులు విషయాన్ని ఉపాధ్యాయులకు, గ్రామస్థులకు తెలిపారు. గ్రామస్థులు పాఠశాల వద్దకు వచ్చి ఆ యువకున్ని పట్టుకుని పాఠశాలలో చెట్టుకు కట్టేసి పోలీసులకు సమాచారమిచ్చారు. గుర్తు తెలియని యువకుడు గంజాయి మత్తులో విద్యార్థులతో ఘర్షణపడు తున్నాడని, ఆ మత్తులో విద్యార్థులను ఏమైనా చేస్తాడని భయంతో చెట్టుకు కట్టేసి పోలీసులకు సమాచారం అందజేసినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. ఆ యువకుడితో వచ్చి వారంతా పారిపోగా ఒక్కడే పట్టుబడ్డారు. ఆ యువకుడు దానవాయిగూడెం ప్రాంతా నికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సఖి జాతీయ మహిళా మండలి జాతీయ కో కన్వీనర్‌గా గిరిజ

ఖమ్మంచర్చి కాంపౌండ్, ఫిబ్రవరి13: సఖి జాతీయ మహిళ మండలి నేషనల్ కో కన్వీనర్‌గా దండమూడి గిరిజ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు మంగళవారం నగరంలోని 27వ డివిజన్‌లో జరిగిన సమావేశంలో సఖి జాతీయ మహిళ మండలి నేషనల్ సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ నరాల సత్యనారాయణ నియమించారు. సత్యనారాయణ మాట్లాడుతూ గిరిజ కరోనా సమయంలో అనేక సేవా కార్యక్రమాలు చేశారని తెలిపారు. గిరిజ మాట్లాడుతూ నాకు ఈ పదవి అప్పగించినందుకు సఖీ జాతీయ మహిళ మండలి సంస్థ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గర్భిణికి గాయాలు

కామేపల్లి, ఫిబ్రవరి 13: రెండు ఆటోలు ఎదురెదురుగా వచ్చి ఢీకొనడంతో ఓ నిండు గర్భిణీకి గాయాలు అయిన సంఘటన కామేపల్లి ండల పరిధిలోని మర్రిగూడెం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. కామేపల్లి మండలం కొత్తతండకు చెందిన అజ్మీర లలిత ఓ నిండు గర్భిణి వైద్యం నిమిత్తం ఖమ్మానికి ఓ ఆటోలో బయలు దేరింది. మర్రిగూడెం దగ్గరకు రాగానే ఎదురుగా మరో ఆటో వచ్చి ఢీకొట్టడంతో ఆమెకు గాయాలు అయ్యాయి. వెంటనే 108లో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి ఆ గర్భినిని తరలించినట్లు 108 సిబ్బంది ఈఎంటీ లింగమూర్తి, పైలెట్ రామారావు తెలిపారు.

ఎమ్మెల్సీ దరఖాస్తుల పరిష్కారం వేగిరం చేయాలి

- అదనపు కలెక్టర్ డి మధుసూదన్ నాయక్

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 13: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకోసం వచ్చిన దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ డి. మధుసూదన్‌నాయక్ కోరారు. మంగళవారం ఆయన ఆర్డీవోలు, తహసీల్దార్లతో ఎమ్మెల్సీ ఓటరు నమోదు, రెవెన్యూ సంబంధ అంశాలపై టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఎమ్మెల్సీ ఓటరు నమోదు దరఖాస్తులు బీఎల్వోలు, ఏఈఆర్వోల లాగిన్ నుంచి వెంటనే పరిష్కరించాలన్నారు. మండలాల్లో స్లాట్ పెండింగులో లేకుండా చూడాలన్నారు. బల్క్ సమస్యలు, డొంక రహదారులు, పెండింగ్ కోర్ట్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వివిధ ప్రాజెక్టుల భూ సేకరణ, రెవెన్యూ సమస్యల పరిష్కారం త్వరితగతిన చేపట్టాలన్నారు. ఈకేవైసి ప్రక్రియ వంద శాతం పూర్తికి చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.

హ్యాండ్‌బాల్ ఎంపికలు పూర్తి

ఖమ్మం స్పోర్ట్స్, ఫిబ్రవరి 13: జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో సీనియర్ పురుషుల, మహిళల హ్యాండ్‌బాల్ జట్ల ఎంపికలు నిర్వహించారు. ఎంపికలకు జిల్లా వ్యాప్తంగా సుమారు 50 మంది క్రీడాకారులు హాజరైనారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన వారిని జిల్లా హ్యాండ్‌బాల్ జట్లకు ఎంపిక చేసినట్లు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ తెలిపింది. త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

చావులోనూ తోడుగా..

● అనారోగ్యంతో భర్త, బెంగతో భార్య కన్నుమూత

పినపాక, ఫిబ్రవరి 13: దాంపత్య జీవితానికి పరిపూర్ణ పరమార్థం అనుకున్నారో ఏమో ఆ దంపతులు ఎనిమిది పదుల వయస్సులో తమ తనువులే వేరు.. ప్రాణాలొక్కటే అని మరణంలో నూ నిరూపించుకున్న ఘటన ఇది. భద్రాద్రి జిల్లా పినపాక మండలం పినపాక గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సుంకరి రాములు (80) కొంతకాలంగా అనారోగ్యంతో భాదపడుతూ, సోమవారం ఉదయం తుది శ్వాస విడిచాడు. భర్తతోనే తన గమనం అనుకున్న ఆ ధర్మపత్ని నర్సమ్మ (70)తన భర్తనే అనుసరించి చివరి శ్వాసవిడిచింది. సోమవారం సాయంత్రం సుంకరి నర్సమ్మ మృతి చెందడంతో ఇద్దరి అంత్యక్రియలను కుమారుడు సాంబశివరావు మంగళవారం నిర్వహించారు. కాగా రాములు, నర్సమ్మకు నలుగురు కుమార్తెలు కాగా ఓ కూతురు దుబాయ్‌లో ఉండడంతో ఆమె ఉంచి, మంగళవారం కుమార్తె రాగానే అంత్యక్రియలు నిర్వహించారు.


రాములు నర్సమ్మ దంపతుల (ఫైల్ ఫోటో)

జిల్లాలో పలువురు ఎస్‌ఐల బదిలీలు

ఖమ్మం క్రైం, ఫిబ్రవరం 13: జిల్లాలో పలువురు ఎస్‌ఐలను బదిలీచేస్తూ పోలీస్‌శాఖ ఉన్నతాధికారులు మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబాబాద్ జిల్లాలోని సీసీఎస్‌లో ఎస్‌ఐగా ఉన్న మధుబాబు ను బోనకల్ ఎస్‌ఐగా నియమితులయ్యారు. అదేవిధంగా సీసీఆర్‌బీ ఎస్‌ఐగా ఉన్న బెజ్జంకి లక్ష్మీబార్గవి మధిర రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా, మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ గా ఉన్న సంధ్య మధిర టౌన్ ఎస్‌ఐగా, సీసీఎస్ ఖమ్మం ఎస్‌ఐగా ఉన్న పర్షిక వెంకటేశ్‌ను ఎర్రుపాలెం పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ గా, విఆర్ ఖమ్మంలో ఉన్న షేక్ నాగుల్‌మీరా చింతకాని పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా, ఖమ్మం టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా ఉన్న వంశీకృష్ణ వైరా పోలీస్‌స్టేషన్ కు నియమితుతయ్యారు. అదేవిధంగా మధిర రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా ఉన్న రఫీ సీఎస్‌బీ ఖమ్మం కు, బోనకల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా ఉన్న సాయికుమార్ ను విఆర్ ఖమ్మంకు, ఎర్రుపాలెం ఎస్‌ఐ గా ఉన్న ఎం.సురేష్‌ను విఆర్ ఖమ్మం కు, చింతకాని ఎస్‌ఐగా ఉన్న రాజేందర్ ను విఆర్ ఖమ్మంకు, మధిర టౌన్ ఎస్‌ఐ గా ఉన్న రాజేష్‌ను విఆర్ ఖమ్మంకు వైరా పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా ఉన్న యం.ప్రసాదును విఆర్ ఖ్మమంకు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం ఎస్‌ఐగా ఉన్న రాజారామ్ ను కారేపల్లి ఎస్‌ఐగా నియమిస్తూ పోలీస్‌శాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

పలువురు సీఐల బదిలీ

జిల్లాలో పలువురు సీఐలు బదిలీచేస్తూ పోలీస్‌శాఖ ఉన్నతాధికారులు మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కూసుమంచి సీఐ గా ఉన్న కె.జితేందర్‌ను మల్టీజోన్-1 కు రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. మల్టీజోన్-1లో వెయిటింగ్‌లో ఉన్న బి.జనార్ధన్ కు కూసుమంచి సీఐ గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. అదేవిధంగా వరంగల్ కమిషనరేట్‌లో వెయిటింగ్‌లో ఉన్న జె.వెంకటరత్నం ను ఖమ్మం మహిళా పోలీస్‌స్టేసన్ సీఐ గా నియమిస్తూ ఉత్తర్వులలో పోలీసు అధికారులు పేర్కొన్నారు.

గురుకుల పీజీటీ ఫలితాల్లో 9వ ర్యాంకు సాధించిన సాయిరాం

బోనకల్, ఫిబ్రవరి 13: పోస్టు గ్రాడ్యుయేషన్ ఫలితాల్లో మండలం గోవిందాపురం (ఎల్) గ్రామానికి చెందిన తమ్మారపు సాయిరాం 9వ ర్యాంకు సాధించాడు. పీజీటీ గురుకుల పరీక్షా ఫలితాల్లో బయాలజికల్ సబ్జక్టులో అత్యుత్తమ ప్రతిభ చాటాడు. గ్రామానికి చెందిన తమ్మారపు కోటయ్య, అనసూయ దంపతుల కుమారుడు సాయిరాం గత కొన్ని సంవత్సరాలుగా అనారోగ్య సమస్యలతో బాదపడుతున్నాడు. తల్లిదండ్రులు ఇద్దరు కూలీలు కావడంతో ఇంటి పోషణతో పాటు వైద్య సేవలకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనేవారు. అనారోగ్యం బాదపడుతున్నా వాటిని భరిస్తూనే పీజీ విద్యను పూర్తి చేశాడు. ఉద్యోగం సాదించాలన్న లక్ష్యంతో కష్టపడి చదివి మొదటి ప్రయత్నంలోనే అత్యుత్తమ ర్యాంకు సాదించాడు. సాయిరాంను గ్రామస్థులు ప్రజా ప్రతినిధులు అభినందించారు.


సాయిరాం

ఖమ్మం జిల్లా సహకార అధికారిగా మురళీధర్‌రావు

● గతంలో డీఆర్‌డీవోగా ఇన్‌చార్జ్ డీసీవోగా బాధ్యతల నిర్వహణ

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 13: జిల్లా సహకారశాఖ అధికారిగా వంకాయలపాటి మురళీధర్‌రావు ప్రభుత్వం నియమించింది. వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు వైద్య యూనివర్సిటీలో రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న మురళీధర్‌రావు సొంతశాఖ పరంగా జరిగిన బదిలీల్లో ఖమ్మం డీసీవోగా బదిలీ చేశారు. అయితే 2015 ఫిబ్రవరి 14 నుంచి 2018 మార్చి 15వరకు ఖమ్మం జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఆయన బాధ్యతలు నిర్వహించారు. సెర్ప్, డ్వామా, డీఆర్‌డీఏ విభాగాలను జాతీయ స్థాయిలో ముందుకు తీసుకెళ్లారు. పలు జాతీయ అవార్డులను కైవసం చేసుకున్నారు. ఖమ్మం డీఆర్‌డీఏ మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో అమలు చేసిన రూ.30కే లంచ్ బాక్స్ భోజన ప్యాకెట్, రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలో అమలు జరిగింది. ఇదే సమయంలో ఇన్‌చార్జ్ జిల్లా సహకార అధికారిగా మురళీధర్ పనిచేశారు. బుధవారం ఆయన డీసీవోగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఖమ్మంలో పనిచేసిన డీసీవో విజయకుమారి కరీంనగర్‌కు బదిలీపై వెళ్లారు.


మురళీధర్‌రావు

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఎస్ఆర్ ప్రభంజనం

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 13 : అత్యంత ప్రతిష్ఠాత్మకమైన జేఈఈ మెయిన్స్ 2024 (సీజన్-1) ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ప్రభంజనం సృష్టించినట్లు ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి తెలిపారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో జాతీయ స్థాయిలో దొంతుల మనీష్ 99.99 శాతం పర్సంటైల్ సాధించి ఎస్ఆర్ విద్యాసంస్థల కీర్తి ప్రతిష్టలను జాతీయస్థాయిలో నిలబెట్టినట్లు తెలిపారు. అలాగే తుమ్మ తేజస్వీ 99.95 శాతం, ఆర్.దీపాన్ష్ రెడ్డి 99.19 శాతం, పి.నిహాల్ శ్రీవాత్సవ్ 99.91 శాతం సాధించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో అత్యుత్తమైన ర్యాంకులు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామన్నారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను వరదారెడ్డి అభినందించారు.


మనీష్


తేజస్వీ

జాతీయస్థాయి టీటీ పోటీలలో ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ప్రతిభ

ఖమ్మం స్పోర్ట్స్/చుంచుపల్లి ఫిబ్రవరి 13: ఈనెల 8 నుంచి 13 వరకు గోవాలో జరిగిన జాతీయస్థాయి మాస్టర్స్ టేబుల్ టెన్నిస్ పోటీలలో జిల్లాకు చెందిన యాకూబ్‌అలీ, లోకేష్ ప్రతిభ చూపి పతకాలు సాధించారు. పోటీలలో రాష్ట్ర జట్టు తరుపున పాల్గొన్న వారు సింగిల్స్ విభాగంలో రజత, డబుల్స్ విభాగంలో కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. జాతీయ పోటీలలో ప్రతిభ చూపిన డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, టేబుల్ టెన్నిస్ సంఘం జిల్లా అధ్యక్షుడు బాలసాని విజయ్, కార్యదర్శి ఓలేటి సాంబమూర్తి అభినందించారు. భవిష్యత్ పోటీలలో రాణించి జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

చుంచుపల్లి: జాతీయ మాస్టర్స్ టీటీ పోటీలలో కొత్తగూడేనికి చెందిన ఇడుపుగంటి లోకేష్ పాల్గొని ప్రతిభను కన బరిచి సింగిల్స్, డబుల్స్ విభాగాలలో పథకాలను సాధించాడు. ఈ నెల 8వ తేదీ నుంచి 13వరకు ఫటోర్డా గోవాలో జరిగిన జాతీయ స్థాయి మాస్టర్స్ టేబుల్ టెన్నిస్ విభాగంలో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించి సింగిల్స్ కాన్యపతాకం, డబుల్స్ విభాగంలో రజిత పతాకాలను సాధించి రాష్ట ఖ్యాతిని ఇనుమడింప చేశాడు. డబుల్స్ విభాగంలో ఖమ్మంకు చెందిన యాకూబ్ ఆలీతో కలిసి లోకేష్ పోటీలలో పాల్గొని ప్రతిభను కనబరిచారు. క్రీడాకారులు ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్, థామస్, ఎంవి.రమణ, చందు, రియాజ్, ఇమ్మానియేలు, ఫనీ, రాంబాబు, వర్ధన్‌రావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.


పతకాలు సాధించిన క్రీడాకారులు

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎర్రుపాలెం విద్యార్థి

ఎర్రుపాలెం, ఫిబ్రవరి 13: ఎర్రుపాలెంలోని ఎస్‌జేకేఎం జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న అంగిరేకుల సతీష్‌కుమార్ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ దండం అలివేలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయ్యవారిగూడెం గ్రామానికి చెందిన సతీష్ ఇంటర్ ఎంపీసీలో మొదటి సంవత్సరం చదువుతు న్నాడు. ఖమ్మం పటేల్‌స్టేడియంలో జరిగిన జోనల్‌స్థాయిలో మంచి ప్రతిభ కనపర్చటంతో సూర్యాపేటలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. కళాశాల కరస్పాం డెంట్ అలివేలు మాట్లాడుతూ క్రీడలు అనేవి స్ఫూర్తిదాయకమైనవని, నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారులకి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం కళాశాలలో సతీష్‌ను షాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగిరెడ్డి సౌజన్య, ఎర్రబోలు నాగేశ్వరరావు, అధ్యాపకుడు గోపినాయక్, నాగమల్లేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.


సతీష్‌కుమార్

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో జిల్లాకు పతకాల పంట

- అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీకు నాగలక్ష్మి ఎంపిక
- గ్రామీణ ప్రాతానికి వన్నె తెచ్చిన పీఈటీ

లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి 3: జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో భద్రాద్రి జిల్లాకు అవార్డుల పరంపర కొనసాగింది. జిల్లా నుంచి 8 మంది క్రీడాకారులు పతకాలు సాధించారు. ఈ పోటీల్లో జిల్లాకు 4స్వర్ణ, 5 రజిత, 3 కాంస్య పతకాలు కైవశం చేసుకొన్నారు. లక్ష్మీదేవిపల్లి మండల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన పీఈటీ కొర్సా నాగలక్ష్మి 400 మీటర్ల హడిల్‌లో బంగారు పతకం, ట్రిపుల్ జంప్‌లో రజత పతకం సాధించి అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఎస్ షతీస్ 200 మీటర్ల రన్నింగ్‌లో బంగారు పతకం, కె రామకృష్ణ 4+100 పరుగు పందెంలో రజత పతకం, జె కృష్ణ 400 మీటర్ల పరుగు పందెంలో క్యాంస్య పతకం, సిహెచ్ రాంబాబు జావలిన్‌త్రోలో రజత పతకం, వి నాగేంద్రాబాబు 100 మీటర్ల పరుగు పందెలంలో రజత పతకం , పి సుధాకర్ రాజు 100 పరుగు పదెంలో బంగారు పతకం సాధంచారు. 400 మీటర్ల హడిల్స్ పోటీల్లో బంగారు పతకం సాధించి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాకు. ఈనెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో దేశంలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, కేరళ, రాజస్థాన్, మణిపూర్, చతీష్‌గడ్, ఢిల్లీ, హర్యాన, తదితర 28 రాష్ట్రాల నుంచి 1700 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో అత్యుతమ ప్రతిభ కనపర్చిన 8 మంది క్రీడాకారులకు పతకాలు లబించాయి. నూటికి నూరు శాతం గిరిజన జిల్లా నుంచి ఎంపికైన గిరిజన క్రీడాకారిణి నాగలక్ష్మి, ఆమె ఎంపిక పట్ల ఆపాఠశాల ఉపాధ్యాయులు, జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. విజేతలకు మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి , నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ కార్యదర్శి శర్మ, నేషనల్ మాస్టర్స్ లైఫ్ అధ్యక్షులు లక్మారెడ్డి, నేషనల్ మాస్టర్ రాష్ట్ర కార్యదర్శి ప్రభ తదితరులు పాల్గొని విజేతలకు పతాకాలు అందజేశారు.


అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులు


అంతర్జాతీయ అథ్లెటిక్స్‌కు ఎంపికైన నాగలక్ష్మికి అవార్డులు అందజేస్తున్న మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే

రోడ్డు భద్రతపై అవగహన

కల్లూరు, ఫిబ్రవరి13: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా కల్లూరులో మంగళవారం రోడ్డు భద్రతపై కళాజాత ప్రదర్శనలతో అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఎంవిఐ ఎస్ వెంకటపుల్లయ్య, ఎస్ఐ ఎస్కె షాకీర్ మాట్లాడుతూ మద్యం మత్తుతో వాహనాలు నడపడం ప్రమాదకరమని హెచ్చరించారు. హెల్మెట్ ధరించి ద్విచక్ర వావానాలు, సీట్ బెల్ట్ పెట్టుకొని కార్లు నడపాలని తద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చునని ప్రజలకు సూచించారు. రోడ్డుపైకి వాహనాలతో వస్తున్న ప్రతీ వ్యక్తి తన కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నారు. యువత వాహనాలపై అతివేగంగా తిరుగుతూ ఇబ్బంది కలిగిస్తున్నారని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కళాజాత ద్వారా ఆటో డ్రైవర్లకు, ప్రజలకు రోడ్డు భద్రతపై అవగహన కల్పిస్తూ పాటల ద్వారా చైతన్యం కలిగించారు. స్థానిక మెయిన్ సెంటర్‌లో అధికారులు, ఆటో డ్రైవర్లు మానవహారం, ప్రతిజ్ఞ నిర్వహించారు.

నేడు సత్తుపల్లిలో విద్యుత్‌కోత

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి13: సత్తుపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని సత్తుపల్లి టౌన్-1 ఫీడర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న టౌన్‌ఏఈ శరత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు శ్రీనివాసా థియేటర్ రోడ్డులో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

న్యూలిటిల్‌ఫ్లవర్ విద్యార్థుల ప్రభంజనం


విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

వైరా, ఫిబ్రవరి 13: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) వారు జాతీయస్థాయిలో నిర్వహించి జేఈఈ మెయిన్స్ 2024 సంవత్సరానికిగానూ నిర్వహించిన మొదటి సెషన్ ఫలితాల్లో వైరాలోని న్యూలిటిల్‌ఫ్లవర్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారు. మొదటి బ్యాచ్‌లోనే 24 మంది విద్యార్థులు పరీక్షలు రాసి జేఈఈ అడ్వాన్స్‌డ్ రాసేందుకు పదిమంది అర్హత సాధించారు. అర్హత సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, డైరెక్టర్లు డాక్టర్ కాపా మురళీకృష్ణ, లగడపాటి ప్రభాకర్, కుర్రా సుమన్ అభినందించారు.

క్విజ్ పోటీల విజేతలకు బహుమతుల పంపిణీ

సత్తుపల్లి, ఫిబ్రవరి13: సత్తుపల్లి మండల సాంఘీక శాస్త్రఫోరం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎన్టీఆర్‌నగర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన క్విజ్ పోటీలలో విజేతలకు బహూమతులను పంపిణీ చేశారు. వరుసగా మూడు స్థానాల్లో రేజర్ల, సదాశివుని పాలెం, అయ్యగారిపేట జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థులు నిలవగా నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. పర్సా సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ స్థానంలో రేజర్ల, ద్వితీయ స్థానంలో తుంబూరు, తృతీయస్థానంలో పట్టణంలో గర్ల్స్‌హైస్కూల్ నిలిచినట్లు నిర్వహకులు పుల్లయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నక్కా రాజేశ్వరరావు, పూరేటీ యాకోబు, నాగేశ్వరరావు, వీర్ల సరోజిని, ప్రసాద్, షాహీనాబేగం పాల్గొన్నారు.

సిబ్బంది పెరిగారు.. సేవలు మెరుగవ్వాలి

- కలెక్టర్ గౌతమ్
- జిల్లా జనరల్ ఆస్పత్రి వైద్యులతో సమీక్ష


వైద్యులతో సమీక్షిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మంకలెక్టరేట్,ఫిబ్రవరి13: 'వైద్యకళాశాల రాక ముందు 90 మంది వైద్యులు ఉన్నారు. ఇప్పుడు 113 మంది ఉన్నారు. స్టాఫ్‌నర్సులు 147మంది ఉంటే. ఇప్పుడు 230మంది ఉన్నారు...! ఇంత పెద్దమొత్తంలో సిబ్బంది ఉండి ప్రజలకు మెరుగైన సేవలు అందించకుంటే ఎలా, మీ పనితీరు మార్చుకోవాలి. రోగులకు మరింత మెరుగైన సేవలు అందించాలి' అని కలెక్టర్ వీపీ గౌతమ్ జిల్లా జనరల్ ఆస్పత్రి వైద్యులకు దిశానిర్దేశం చేశారు. మంగళవారం ఆయన ప్రభుత్వ వైద్య కళాశాలలోని ప్రిన్సిపాల్ ఛాంబర్‌లో వైద్యాధికారులు, వివిధ విభాగాల అధిపతులతో వైద్య సేవలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాకు ప్రభుత్వ వైద్యకళాశాల మంజూరుతో ఆసుపత్రిలో సేవలు మరింతగా మెరుగవ్వాలన్నారు. ప్రసవాలు పెంచాలని కనీసం నెలకు 1000 ప్రసవాల లక్ష్యంగా పెట్టుకుని దానికి అనుగుణంగా సేవలందించాలన్నారు. అది కూడా సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యతను ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. ఆసుపత్రిలో రెండు టిఫా పరీక్ష యంత్రాలు,ఐదుగురు రేడియాలజిస్టులు ఉన్నారని టిఫా పరీక్షలు కూడా ఇంకా పెంచాలన్నారు. స్కానింగ్, సిటీ స్కాన్ పరీక్షలు పెంచాలని, టిఫా, స్కానింగ్ పరీక్షలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సమన్వయం చేసుకోవాలని అన్నారు. ప్రధాన ఆసుపత్రిలో ఎంఆర్ఐ మంజూరుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. ఆప్తమాలజీ, ఆర్థోపెడిక్, సర్జరీ తదితర విభాగాల్లో సాధించిన పురోగతిపై కలెక్టర్ తెలుసుకున్నారు. వీటిపై ఆయన ఒకింత అసంతృప్తిని వ్యక్తం చేశారు. డాక్టరు నిత్యం అందుబాటులో ఉండి రోగులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలన్నారు. ఆస్పత్రిలో సదుపాయాలు, సౌకర్యాలను సమకూర్చుతున్నా అనుకున్న విధంగా సేవలు అందడం లేదని వీటిపై మరింత దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల అవసరాల దృష్ట్యా భవనాల నిర్మాణానికి స్థల సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఎంబీబీఎస్ రెండో సంవత్సరం ల్యాబ్, లెక్చర్ హాళ్లు, అవసరం దృష్ట్యా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి బి వెంకటేశ్వర్లు, జిల్లా వైద్యాధికారి రాము నాయక్, ఆస్పత్రి సూపరిన్‌టెండెంట్ ఎల్ కిరణ్‌కుమార్ వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

వీవీసీ మోటార్స్‌లో లక్కీడ్రా


లక్కీడ్రా తీస్తున్న వినియోగదారుడు

ఖమ్మంసంక్షేమవిభాగం,ఫిబ్రవరి13: దసరా, దీపావళి సందర్భంగా వెంకటరమణ(వీవీసీ) ఆటోమొబైల్స్ మూడు చక్రాల విభాగంలో నిర్వహించిన లక్కీ డ్రాను మంగళవారం విజేతలను ప్రకటించారు. షోరూంకు వచ్చిన వినియోగదారులచే లక్కీడ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.2లక్షల విలువైన పలు విభాగాల్లో బహుమతులను విజేతలకు అందించారు. ఖమ్మానికి చెందిన మహ్మద్ పాషాకు రూ.90వేల విలువైన మొదటి బహుమతి పొందారు. రెండో బహుమతిని కారేపల్లికి చెందిన పూనేం భద్రయ్య, మూడో బహుమతి వెంకటాపురానికి చెందిన మాటూరు వెంకటేశ్వర్లు లక్కీ డ్రాలో పొందారు. బహుమతులు పొందిన వినియోగదారులను వీవీసీ సంస్థల ఛైర్మన్ రాజేంద్రప్రసాద్ అభినందించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పెరిగిన వాహనాలకు తగిన విధంగా రెండో వర్క్ షాప్‌ను త్వరలో ప్రారంభిస్తామన్నారు.

ప్యాడ్లు, పెన్నుల పంపిణీ

ఏన్కూరు,ఫిబ్రవరి13: కేసుపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు లక్ష్మిచారిటబుల్ ట్రస్టు ద్వారా మంగళవారం ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ఛైర్మన్ సాగబోయిన పాపారావు, హెచ్ఎం లక్ష్మినారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన

రఘునాథపాలెం, ఫిబ్రవరి13: గ్రామంలో తాగునీటి సరఫరా జరగటం లేదని ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈసంఘటన రఘునాథపాలెం మండల కేంద్రంలో చోటు చేసుకొంది. వేపకుంట్లలో వారం రోజులకు పైగా మిషన్ భగీరథ తాగునీటి సరఫరా కావటం లేదు. గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారని ఆరోపిస్తూ మాజీసర్పంచ్, కాంగ్రెస్ నాయకులు రేమళ్ల రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఎంపీడీవో రామకృష్ణకు నాయకులు వినతిపత్రం అందించి తాగునీటి సమస్యను వివరించారు. నాయకులు చాలుగానీ రామారావు, గునగంటి రామారావు, రెంటాల దానయ్య, బాణోత్ వెంకన్న, దారా శ్రీకృష్ణ పాల్గొన్నారు.

డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లుకు భట్టి, రవి నివాళి



సోదరుడు వెంకటేశ్వర్లు భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ మల్లు రవి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నందిని దంపతులు

వైరా,ఫిబ్రవరి13: అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందిన తమ సోదరుడు డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మల్లు రవి నివాళులర్పించారు. డాక్టర్ వెంకటేశ్వర్లు భౌతిక కాయాన్ని మంగళవారం సాయంత్రం ఆరున్నర గంటల సమయంలో వైరాలోని ఆయన ఇంటికి తీసుకువచ్చారు. సోదరులైన భట్టి విక్రమార్క, రవి తదితరులు భౌతిక కాయాన్ని అంబులెన్స్ నుంచి ఇంట్లోకి తీసుకువెళ్లారు. భట్టి విక్రమార్క, నందిని దంపతులు వారి కుమారుడు, డాక్టర్ రవి, ఆయన కుటుంబసభ్యులు, పలువురు ప్రముఖులు వెంకటేశ్వర్లు భౌతికకాయానికి నివాళులర్పించారు. ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, ఏసీపీ ఎం.ఏ.రెహ్మాన్, అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌ఛైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మునిసిపల్ ఛైర్మన్ సూతకాని జైపాల్, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వర్‌రెడ్డి, రాయల నాగేశ్వరరావు, అనేకమంది ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. బుధవారం ఉదయం స్నానాల లక్ష్మీపురంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

పెండింగ్ డీఆర్‌ను విడుదల చేయాలి

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 13: పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు గత ప్రభుత్వం 2022 నుంచి డీఆర్‌ను పెండింగ్‌లో ఉంచిందని, వెంటనే పెండింగ్ బకాయిలను చెల్లించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణం నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఖమ్మంలో మంగళవారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీఆర్‌సీ కమిషన్ మేరకు 30శాతం ఫిట్‌మెంట్‌ను ప్రభుత్వం ప్రకటించాలని కోరారు.భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు గోపీచంద్, రాజేంద్రప్రసాద్, శ్రీధర్, కృష్ణారావు, కోమ్మాలు వెంకటయ్య, చంద్రశేఖర్, పీ వెంకన్న, సాహెబ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తోపుడుబండి ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్ల వితరణ

కల్లూరు, ఫిబ్రవరి13: కల్లూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం తోపుడుబండి ఫౌండేషన్ తరుపున రూ.22 వేల విలువగల స్టడీఛైర్స్, లాంగ్ ప్యాడ్స్ పది విద్యార్థులకు అందజేశారు. తోపుడుబండి ఫౌండేషన్ అధినేత ఎస్‌కె.సాధిక్‌అలీ వాటిని విద్యార్థులకు అందించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యంలో చదువుకోవాలన్నారు.

పల్స్ పోలియోకు వ్యాక్సిన్ సిద్ధం చేయాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాము నాయక్

ఖమ్మంకలెక్టరేట్, ఫిబ్రవరి13: మార్చి 3,4 తేదీల్లో నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని, అవసరానికి తగినట్లుగా వ్యాక్సిన్‌ను సిద్ధం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాము నాయక్ సూచించారు. మంగళవారం టీటీడీసీ సమావేశ మందిరంలో వైద్యాధికారులతో సమీక్షించారు. ప్రతీ గ్రామం నుంచి పల్స్ పోలియో పై ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీలు ఈ కార్యక్రమం పట్ల పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో డబ్ల్యూహెచ్‌వో సర్వేలెన్స్ అధికారి ప్రశాంత్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ప్రమీల, ప్రోగ్రాం అధికారులు జి.లక్ష్మీనారాయణ, డాక్టర్ బి భాస్కర్, పి కాశీనాథ్, సాంబశివరెడ్డి, జిల్లాలోని అన్నిపీహెచ్‌సీల ,ఆరోగ్య వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

'కార్పొరేట్‌కు దోచిపెడుతున్న కేంద్రం'

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి13: నరేంద్రమోదీ ప్రధాని అయిన తర్వాత దేశసంపదను కార్పోరేట్‌కు దోచిపెడుతున్నారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్యాణ వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన సత్తుపల్లిలోని శ్రీసర్వరాయ షుగర్స్ లిమిటెడ్ కిస్నే ఫ్యాక్టరీ వద్ద యూనియన్ నాయకులతో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్నారు. ఈనెల16న దేశవ్యాప్తంగా నిర్వహించే సమ్మెను అన్నివర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు చలమాల విఠల్‌రావు, కొలికపోగు సర్వేశ్వరరావు, మల్లూరు చంద్రశేఖర్, ప్రసాద్, రాజేష్, టీకే.ప్రసాద్, జిలానీ, చారీ, వెంకటేశ్వర రావు, హుస్సేన్,రవి, కేశవరావు, సత్యనారాయణ, శివరామకృష్ణ, అమీనాబీ, లక్ష్మీ, కృష్ణవేణి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌కు కీర్తన

కల్లూరు, ఫిబ్రవరి13: మండలంలోని చెన్నూరు గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ కు చెందిన దంతాల కీర్తన హైదారాబాద్‌లో త్వరలో రాష్ట్రస్థాయిలో జరగనున్న ఇన్‌స్పైర్ ప్రాజెక్ట్ పోటీలకు ఎంపికైంది. చెన్నూరు ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న కీర్తన దమ్ము చేసేటప్పుడు ట్రాక్టర్ ప్రమాదాల నివారణ పరికరం అనే అంశంపై జిల్లా స్థాయిలో ఇటీవల జరిగిన ఇన్‌స్పైర్ పోటీల్లో ప్రతిభన కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది.

'తెగా' జిల్లా అధ్యక్షుడిగా శ్రీను

కామేపల్లి, ఫిబ్రవరి13: తెలంగాణ గిరిజన ఉద్యోగులు సంక్షేమ సంఘం(తెగా) జిల్లా అధ్యక్షుడిగా కామేపల్లి మండల బాసిత్ నగర్ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు బాదావత్ శ్రీనును మంగళవారం ఎన్నుకున్నారు.

ముమ్మరంగా టీజీవో సభ్యత్వ నమోదు

ఖమ్మంకలెక్టరేట్, ఫిబ్రవరి13: సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయములో వివిధ విభాగాల్లో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయా విభాగాల్లోని గెజిటెడ్ అధికారులకు టీజీవో సభ్యత్వాన్ని జిల్లా అధ్యక్షుడు కస్తాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మోదుగు వేలాద్రి ఆధ్వర్యంలో సభ్యత నమోదు చేసి అందచేశారు. ఈ కార్యక్రమంలో నాన్‌గెజిటెడ్ యూనియన్ జిల్లా నాయకులు కొణిదెల శ్రీనివాస్, గుంటుపల్లి శ్రీనివాసరావు కొమరగిరి దుర్గాప్రసాద్ రవీంద్రబాబు, నగేష్ ,వినయ్, సౌజన్య నూర్జహాన్ బేగం రేష్మ, శేషు ప్రసాద్ అసోసియేట్ ప్రెసిడెంట్ వాసిరెడ్డి శ్రీనివాస్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్వి కృష్ణారావు, నయీమ్ పాషా మంజుల తమ్మిశెట్టి శ్రీనివాస్ మోదుగు వెంకటేశ్వర్లు , శేషు, వాసిరెడ్డి శ్రీనివాస్, ఎన్వీ, కృష్ణారావు, నాయిమ్‌పాషా,మంజుల, తమ్మిశేటట్టి శ్రీనివాస్, మెదుగు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. టీఎన్‌జీవోస్ నాయకులు బుల్లెట్ శ్రీనివాసరావు సంఘీభావం తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో రేషన్ బియ్యం స్వాధీనం

కూసుమంచి, ఫిబ్రవరి13: అక్రమంగా నిల్వ ఉంచిన 250 బస్తాల రేషన్ బియ్యాన్ని కూసుమంచి మండలం గట్టుసింగారం గురుదత్తా గార్డెన్స్ సమీపంలో పత్తిచేనులో సూర్యాపేట జిల్లా పోలీసులు మంగళవారం దాడిచేసి పట్టుకున్నారు. సూర్యాపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల సూర్యాపేట జిల్లాలో తనిఖీలు నిర్వహిస్తుండగా ముగ్గురు నిందితులు రేషన్ బియ్యాన్ని తరలిస్తూ పట్టుబడ్డారని తెలిపారు. నిందితులను విచారణ జరపగా, ఎక్కడెక్కడ నిల్వ ఉంచారో వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించగా ప్లాస్టిక్ బస్తాల్లో నిల్వ చేసి టార్పల్ కప్పిన ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బియ్యం విలువ సుమారు రూ.5లక్షల వరకు ఉంటుందని తెలిపారు. గతంలోను నిందితుల నుంచి సూర్యాపేటలో 20 టన్నులు రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముగ్గురి నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కల్లూరు: మండలంలోని చిన్నకోరుకొండిలో సోమవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న 45క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్థానిక పోలీసులు పట్టుకున్నారు. గ్రామంలో బోలెరో వ్యాన్లో బియ్యం తరలించేందుకు సిద్ధంగా ఉండగా అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ ఎస్‌కె షాకీర్ తెలిపారు. నిందితులు కె.మల్లికార్జునరావు, కె.వెంకటేశ్వరరావు, కె నరిసింహారావుపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఖమ్మంక్రైం: రేషన్ బియ్యాన్ని అక్రమంగా లోడ్ చేస్తున్న వారిని ఖమ్మం అర్బన్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని పార్శీబంధానికి చెందిన చల్లా గోపి, సంబోజురాజు, ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం లింగాలకు చెందిన పల్లపు రాము నగరంలోని రేషన్ బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేసి ఓవాహనంలో లోడ్ చేస్తున్నారు. సమాచారం అందుకున్న అర్బన్ పోలీసులు 35 క్వింటాల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. నగర శివారులో కొత్తగూడెం ప్రాంతానికి చెందిన ఒగ్గు వెంకటేవ్వరరావు ఇంట్లో నిల్వ చేసిన 44 బస్తాల్లో 22క్వింటాల బియ్యాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు.

జలఉద్యమానికి తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు


సత్తుపల్లిలో మాజీ ఎమ్మెల్యే సండ్ర ఆధ్వర్యంలో సభకు వెళుతున్న నాయకులు

సత్తుపల్లి, ఫిబ్రవరి13: కృష్ణా నదీజలాలపై తెలంగాణ హక్కులను కాపాడుకోవడం కోసం మంగళవారం నల్లగొండలో నిర్వహించిన కేసీఆర్ భారీ బహిరంగ సభకు సత్తుపల్లి నుంచి బీఆర్ఎస్ శ్రేణులు తరలి వెళ్లాయి. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆధ్వర్యంలో స్థానిక లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్ కార్లు, బస్సుల ర్యాలీను ప్రారంభించారు. జల ఉద్యమంలో పాల్గొన్న ప్రతిఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.

తల్లాడ: తల్లాడలో నల్గొండకు వెళ్లే బస్సుల ర్యాలీని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దుగ్గిదేవర వెంకట్‌లాల్, దూపాటి భద్రరాజు, శీలం కోటారెడ్డి పాల్గొన్నారు.

పెనుబల్లి: బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కనగాల వెంకట్రావ్, జడ్పీటీసీ మోహన్‌రావు ఆధ్వర్యంలో వెళ్లారు.

ముదిగొండ: ముదిగొండ మండలం నుంచి భారీగా బయల్దేరి వెళ్లారు. కార్యక్రమంలో ఎంపీపీ సామినేని హరిప్రసాద్, పోట్ల వెంకటప్రసాద్, వాచేపల్లి లక్ష్మారెడ్డి, మీగడ శ్రీనివాస్‌యాదవ్, బంకా మల్లయ్య పాల్గొన్నారు.

ఖమ్మంకార్పొరేషన్: నల్గొండలో మంగళవారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ భారీ బహిరంగసభకు ఖమ్మం నుంచి వాహనాల్లో బీఆర్ఎస్ శ్రేణులు తరలి వెళ్లారు. జిల్లా బీఆర్ఎస్ కార్యాలయం వద్ద వాహనాల ర్యాలీని మేయర్ పునుకొల్లు నీరజ, బీఆర్ఎస్ సీనియర్ కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, నాయకులు గుండాల కృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ బహిరంగసభలో బీఆర్ఎస్ శ్రేణులు, కార్పొరేటర్లు భారీగా పాల్గొని, కేసీఆర్ జరిపే పోరాటంలో భాగస్వాములు కావాలని కోరారు.

డ్రాగన్ ఫ్రూట్ సాగుతో అధిక సిరులు


డ్రాగన్ మొక్కలు నాటుతున్న నల్లమల

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి13: ఖమ్మం అర్బన్ మండలం బల్లేపల్లిలో రైతు సమన్వయ సమితి మాజీ కోఆర్డినేటర్ నల్లమల వెంకటేశ్వరరావు వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం డ్రాగన్ ఫ్రూట్ సాగు కోసం మొక్కలను నాటారు. సిరులు కురిపించే డ్రాగన్ ఫ్రూట్‌ను వ్యవసాయ అధికారులు, అనుభవం ఉన్న రైతుల సలహాలు, సూచనలతో మంచి దిగుబడి కసం అర ఎకరంలో సాగు చేస్తున్నట్లు నల్లమల వెంకటేశ్వరరావు తెలిపారు. అభ్యుదయ రైతులు ముందుకు వస్తే లాభదాయక పంటలకు రైతులు మొగ్గుచూపుతారని జిల్లా వ్యవసాయ అధికారి ఎం. విజయనిర్మల అన్నార. జిల్లా ఉద్యాన, పట్టుపురుగుల శాఖ అధికారి అనసూయ, పీడీ, టీఎస్ఎంపీ రమణ సాగులో మెళకువలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డివిజన్ ఏడీఏ ఆర్ శ్రీనివాసరావు, అర్బన్ ఏడీ కిషోర్ బాబు, ఉద్యాన అధికారి వేణు, ఏఈవో షిరిణ్మయి, అల్లిపురం డ్రాగన్ ఫ్రూట్ రైతు ఏపూరి వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి13: గ్రామ పంచాయతీల్లో మల్టీ పర్పస్ విధానం రద్దు చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఇఫ్టూ గ్రామ పంచాయతీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అమర్లపూడి అప్పారావు, పగిడికత్తుల రాందాస్ డిమాండ్ చేశారు. మంగళవారం డీపీవోకు వినతిపత్రం అందించారు.

శివరాత్రి తిరునాళ్ల వేలం పాటలు

మధిరటౌన్, ఫిబ్రవరి13:మధిరలోని శ్రీమృత్యుంజయస్వామి దేవాలయంలో మహాశివరాత్రి తిరునాళ్ల సందర్భంగా మంగళవారం దేవాలయంలో వేలం పాటలు నిర్వహంచారు. కొబ్బరి చిప్పల వేలం పాటను మందడపు రామకృష్ణ రూ.66వేలకు దక్కించుకోగా, లడ్డు ప్రసాదాన్ని వేల్పుల శ్రీనివాసరావు రూ.34,333కు, జెయింట్ వీల్ ఇతర ఆట వస్తువులను మధిరకు చెందిన చల్లా శ్రీనివాసరెడ్డి రూ.21.01లక్షలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాదయ ఇన్‌స్పెక్టర్ సమత, ఈఓ జగన్‌మోహన్ రావు దేవాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమాచార సేకరణ జాగ్రత్తగా చేయాలి

చింతకాని, ఫిబ్రవరి13: ఆరుగ్యారంటీ పథకాల వివరాల సేకరణలో జాగ్రత్త వహించాలని ఎంపీపీ పూర్ణయ్య అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీవో రవీంద్రప్రసాద్, మండల అధికారులు తదితరలు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ టాలెంట్ పరీక్షలు

ఖమ్మంసంక్షేమవిభాగం,ఫిబ్రవరి13: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా వ్యాప్తంగా టాలెంట్ పరీక్షలు నిర్వహించారు. ఖమ్మంలో నిర్వహించిన పరీక్షలకు డీఈవో సోమశేఖరశర్మ హాజరయ్యారు. టాలెంట్ పరీక్షలు రాయటం ద్వారా విద్యార్థుల్లో మానసిక వత్తిడి తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, ప్రైవేట్ విద్యాసంస్థల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కాంతారావు, ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యుడు ఇటికాల రామకృష్ణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి బంజారాల ధన్యవాదాలు

రఘునాథపాలెం, ఫిబ్రవరి13: సంత్ సేవాలాల్ జయంతి ఫిబ్రవరి 15న రాష్ట్రప్రభుత్వం సెలవు దినోత్సవంగా ప్రకటించటంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి బంజార సంఘం నాయకులు ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం రఘునాథపాలెం మండలంలోని మంచుకొండలో సంఘం నాయకులు ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు వాంకుడోత్ దీప్లానాయక్, మాలోత్ రామునాయక్, దేవ్‌సింగ్‌నాయక్, ధరావత్ రాంమూర్తినాయక్, బోడా సతీష్‌నాయక్, బోనాత్ లాల్‌సింగ్, బానోత్ కోటేశ్వరరావు, జగ్యానాయక్, బాధావత్ ధర్మనాయక్ పాల్గొన్నారు.

అక్రమ మట్టి తవ్వకాలను నియంత్రించాలి

ఏన్కూరు, ఫిబ్రవరి13:అక్రమ మట్టితవ్వకాలను నియంత్రించాలని ఎంపీపీ ఆరెం వరలక్ష్మి డిమాండ్ చేశారు. ఏన్కూరులో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ గార్లఒడ్డు, జన్నారం, ఏన్కూరు, అక్కినాపురంతండా, హిమామ్‌నగర్, రాజులపాలెం గ్రామాల్లో తవ్వకాలు సాగుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదన్నారు.

టాలెంట్ టెస్టులో ఏన్కూరు విద్యార్థుల ప్రతిభ

ఏన్కూరు, ఫిబ్రవరి13: జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్‌టెస్టులో ఏన్కూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభచూపారు. మంగళవారం పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు ద్వారా నిర్వహించిన ఈ పోటీలో ఆకర్షదీపిక, జి.కళ్యాణ్ ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు.ఎం.అరవింద్ జడ్పీహెచ్ఎస్ తిమ్మారావు పేట తృతీయస్థానం సాధించారు. 18న ఖమ్మంలో జిల్లాస్థాయి పరీక్షలో వీరు పాల్గొంటారు. కార్యక్రమంలో పరీక్ష కన్వీనర్, జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం కూరాకుల సైదయ్య, ఎంపీడీవో వేణుమాధవ్ పాల్గొన్నారు.

మిడ్డేమీల్స్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

పెనుబల్లి, ఫిబ్రవరి13: పాఠశాలల్లో పనిచేసే మధ్యాహ్నాబోజన కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చలమాల విఠల్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చలమాల సూర్యనారాయణరావు భవన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో వ్యకా.సం జిల్లా కమిటీ సభ్యుడు గాయం తిరుపతిరావు, కార్మికులు లక్ష్మీ, ఉమ, ధనలక్ష్మీ పాల్గొన్నారు.

అటవీ జంతువులు వేటాడితే క్రిమినల్ కేసులు

కారేపల్లి, ఫిబ్రవరి13: మండలంలో విద్యుత్ తీగలతో అడవి జంతువులను వేటాడితే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కారేపల్లి రూరల్ సీఐ బి.తిరుపతిరెడ్డి, ఎస్ఐ పుష్పాల రామారావు హెచ్చరించారు. మంగళవారం కారేపల్లి పోలీసుస్టేషన్‌లో గతంలో విద్యుత్ తీగలతో జంతవులును వేటాడిన వారిని గుర్తించి వారికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

వేతనాలు చెల్లించాలని ఉద్యోగుల వినతి

సత్తుపల్లిరూరల్,ఫిబ్రవరి13: జీతాలు ఇప్పించా లంటూ వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖలో డీఎంఈ, డీహెచ్, టీవీవీపీ, సీఎఫ్‌డ బ్యూలలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్,కాంట్రాక్ట్(ఎన్‌హెచ్ఎం),శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్‌ఉద్యోగులు విన్నవించారు. మంగళవారం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ కే.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎం.వెంకటేశ్వరరావు, సీహెచ్. కోటేశ్వరరావు,వై. సాంబశివ రావు, ఏ.రమేష్‌నాయక్, సీహెచ్.నవీన్, వీ.నాగయ్య, టీ.త్రివేణి పాల్గొన్నారు.

విటమిన్ ఏ ద్రావణం పంపిణీ

తల్లాడ, ఫిబ్రవరి13: మండలంలో మంగళవారం ఐదు సంవత్సరాల్లోపు చిన్నారులకు విటమిన్ ఏ ద్రావణం పంపిణీ కార్యక్రమాన్ని మండల వైద్యాధికారి రత్నమనోహర్ పంపిణీ చేశారు. ఈనెల 19వతేదీ వరకు మండలంలోని తొమ్మిదినెలలు నిండి ఐదు సంవత్సరాల్లోపు ఉన్న చిన్నారులందరికి విటమిన్ ఏ ద్రావణం పంపిణీ చేయనున్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కె.పెద్దపుల్లయ్య, సీహెచ్‌వో భాస్కర్, సిబ్బంది మీరమ్మ, భద్రమ్మ, మోహన్, సురేష్ పాల్గొన్నారు.

మిర్చి పంటను పరిశీలించిన అధికారులు

ముదిగొండ, ఫిబ్రవరి13: మండలంలోని అమ్మపేటలో మిర్చి పంటలను మంగళవారం జిల్లావ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారు. గ్రామంలోని కొంతమంది ఓ నర్సరీలో మిర్చినారు కొనుగోలు చేసి సాగు చేశారు. మిర్చినారు నాసిరకం కావడంతో నష్టపోయామని అధికారులకు తెలపడంతో జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయనిర్మల, ఏడీహెచ్ రమణ, ఏడీఏలు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఏవో రాధ పరిశీలించారు.